క్లుప్తంగా

ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



మడకశిర: నియోజకవర్గ ప్రజలకు మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్‌ఎల్ ఈరలక్కప్ప ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. శ్రీక్రోధి నామ నూతన సంవత్సరంలో ప్రజలకు అన్ని విధాలుగా మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి రైతన్నలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవుడిని వేడుకుంటున్నట్లు చెప్పారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం శ్రీక్రోధి నామ సంవత్సర తెలుగు క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. మడకశిర మండలంలోని ఆమిదాలగొంది త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఈ క్యాలెండర్లను తయారు చేయించారు. సీఐ రాజ్‌కుమార్, తహసీల్దార్ వెంకటేశ్ , త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు ఆదెప్పశెట్టి, సభ్యులు సతీష్‌బాబు, రమేష్ బాబు, ప్రభాకర్, శివకుమార్, మహమ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

విలేకరి వైద్యానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందిస్తున్న దృశ్యం

హిందూపురం: అనంతపురం జిల్లా ఆర్‌టీవీ స్టాఫ్ రిపోర్టర్ చల్లా కే నాయుడు వైద్య సేవల నిమిత్తం ఏపీ ఆగ్రోస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ రూ.40 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ నెల 1వ తేదీ కదిరిలో జరిగిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి సభ కవరేజ్‌కి వెళ్లి తిరుగు ప్రయాణంలో చల్లా కే నాయుడు గాయపడ్డారు. విషయం తెలుసుకున్న నవీన్‌నిశ్చల్ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి బి.శాంతమ్మ చేతుల మీదుగా ఆర్థిక సహాయం అందించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు



అపస్మారక స్థితిలో పడివున్న దాసప్ప

అగళి: మండల కేంద్రంలోని రామపురం రోడ్డులో రోడ్డు ప్రమాదంలో రామనపల్లి గ్రామానికి చెందిన దాసప్పకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... రామనపల్లి గ్రామం నుంచి దాసప్ప పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై అగళికి బయలుదేరాడు. అయితే రామాపురం రోడ్డులో వాహనం అదుపు తప్పింది. అపస్మారకస్థితిలో ఉన్న దాసప్పను స్థానికులు శిర ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం బెంగళూరు తరలించారు. దాసప్ప ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా మంచి నీరు సరఫరా

మడకశిరరూరల్: మండల పరిధిలోని మెళవాయి పంచాయితీలోని గ్రామాల్లో వాటర్ స్కీమ్ బోర్లలో నీటి మట్టం తగ్గిపోవడంతో ట్యాంకర్లు ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నామని సర్పంచ్ రంగనాథ్ తెలిపారు. మెళవాయి, గుడ్డంపల్లి కాలనీ, యూ రంగాపురం గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త బోర్లు వేసే వరకూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయిస్తామన్నారు. ప్రజలు కూడా తాగునీటిని వృథా చేయకుండా అవసరాన్ని బట్టి వాడుకోవాలని సూచించారు.

నేడు చౌడేశ్వరీదేవి బ్రహ్మ రథోత్సవం



లేపాక్షి: కోరిన కోరికలను తీర్చే దైవంగా విరాజిల్లుతున్న చోళసముద్రం చౌడేశ్వరిదేవి రథోత్సవాన్ని మంగళవారం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లేపాక్షి ఆలయం కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సొంత నిధులు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి ఆలయాన్ని సుందరీకరించారు. ఉగాది సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం చౌడేశ్వరిదేవి బ్రహ్మ రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, అలాగే కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా పెద్ద సంఖ్యలో బ్రహ్మ రథోత్సవానికి తరలిరానున్నారు. బ్రహ్మరథోత్సవం మరుసటి రోజు పూల పల్లకీలో అమ్మవారిని ఊరేగించనున్నారు.

పవర్ ఫుల్

నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరైన గ్రామాలు...

శివరం, కేకేపాళ్యం, వైబీ హళ్లి, కదిరేపల్లి, ఇనగలూరు, రంగనహళ్లి, ఆమిదాలగొంది, రామనపల్లి

ప్రస్తుతం నియోజకవర్గంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ల సంఖ్య : 19

- 83 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసిన ప్రభుత్వం
- నూతనంగా 8 విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం
- లోఓల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

మడకశిర: టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫలితంగా విద్యుత్ సమస్యలతో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. అయితే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మడకశిర నియోజకవర్గంలో దశల వారీగా విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నారు. కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం, ఓవర్ లోడ్ ఉన్న చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చడం, అవసరమైన గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. దీంతో లోవోల్టేజీ సమస్య తీరుతోంది. దీంతో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఏర్పడుతుంది.

83 ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు

నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్‌లోడ్‌తో పని చేస్తున్నాయి. దీంతో మోటార్లు కాలిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి ఉండేది. అయితే ఈవిషయాన్ని గుర్తించిన ప్రభుత్వం నూతనంగా 83 ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసింది. గుడిబండ, అమరాపురం, మడకశిర, రొళ్ల మండలాలకు ఈ ట్రాన్స్‌ఫార్లను మంజూరు చేసి రైతులను ఆదుకుంది. ఓవర్‌లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంతే కాకుండా కొత్తగా బోర్లు వేసుకున్న రైతులకు కూడా ఈ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం అందించింది.

మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు ఇలా...

మండలం	ట్రాన్స్‌ఫార్మర్లు
గుడిబండ	30
మడకశిర	28
రొళ్ళ	03
అమరాపురం	22
మొత్తం	83



అగళి మండలం ఇనగలూరులో చురుగ్గా జరుగుతున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు

8 సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు

నియోజకవర్గంలో నూతనంగా 8 విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్ల వరకు వ్యయం అవుతోంది. దాదాపు రూ. 32 కోట్లతో ప్రభుత్వం నూతనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. ఇప్పటికే అగళి మండలంలోని రామనపల్లి సబ్‌స్టేషన్ పనులను పూర్తి చేసింది. అగళి మండలంలోని ఇనగలూరు, అమరాపురం మండలంలోని శివరం విద్యుత్‌సబ్‌స్టేషన్ల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అలాగే గుడిబండ మండలంలోని కేకే పాళ్యం, మడకశిర మండలంలోని వైబీ హళ్లి, కదిరేపల్లి, ఆమిదాలగొంది గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులను ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రొళ్ల మండలంలోని రంగనపల్లిలో కూడా విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి కసరత్తు చేస్తున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల పనులన్నీ పూర్తయితే నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పూర్తిస్థాయిలో తీరే అవకాశం ఉంది.

విద్యుత్ కష్టాలకు చెక్



ఇనగలూరులో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో లోఓల్టేజీ సమస్య తీరనుంది. మూడు గ్రామ పంచాయతీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో విద్యుత్ సబ్ సబ్‌స్టేషన్ మంజూరైంది. విద్యుత్‌శాఖ ఈఈ, డీఈ కూడా సహకారం అందించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేయడం ఎంతో ఆనందంగా ఉంది.

– గిరీష్‌గౌడ్, ఇనగలూరు, అగళి మండలం

గతంలో పట్టించుకోలేదు



గతంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం విద్యుత్ సమస్యలను పట్టించుకోలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టడానికి ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్లు మంజూరు చేయడం ఎంతో గొప్ప విషయం. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి అవకాశం ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రైతుల పక్షపాతి అనడానికి ఇదే నిదర్శనం.

– హనుమంతరాయప్ప, టీడీ పల్లి, రొళ్ల మండలం

స్వార్థ ప్రయోజనాల కోసమే వైఎస్సార్‌సీపీపై విమర్శలు

- ఇక్బాల్‌పై మైనార్టీ నాయకుల ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మైనార్టీ నాయకులు

హిందూపురం: మహమ్మద్ ఇక్బాల్‌కు పార్టీ అన్ని విధాలా సముచిత స్థానం కల్పించింది. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో పాటు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చింది. పాలు తాగి తల్లి రొమ్మును గుద్దినట్లుగా ఆయన ఇప్పుడు వైఎస్సార్‌సీపీని విమర్శించడం హేయమని వైఎస్సార్‌సీపీ మైనార్టీ కౌన్సిలర్లు, ముతవల్లీలు ధ్వజమెత్తారు. సోమవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గంలో ఎంతోమంది సీనియర్ నాయకులను కాదని 2019లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశమిస్తే ఇదేనా మీరు చూపించే కృతజ్ఞత అని ప్రశ్నించారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న టీడీపీలోకి వెళ్తున్న ఇక్బాల్... మైనార్టీల సంక్షేమం గురించి మాట్లాడటం దయ్యాలు వేదలు వల్లించడమే అవుతుందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే టికెట్ ఇవ్వలేదన్న అక్కసుతోనే స్వార్థ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జాబీవుల్లా, కౌన్సిలర్లు ఆసిఫ్‌వుల్లా, షాజియా, పట్టణ అధ్యక్షులు ముస్తఫా, ముతవల్లీలు ఖాశీం సాబ్, అంజాద్ తదితతరులు పాల్గొన్నారు.

'రంజాన్'ను ప్రశాంతంగా జరుపుకోండి



మాట్లాడుతున్న సీఐ సురేశ్

పావగడ: పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణం నిర్వహించుకోవాలని సీఐ సురేశ్ ముస్లింలకు సూచించారు. స్థానిక జామియా షాదీ మహల్‌లో సోమవారం నిర్వహించిన శాంతి సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉండడంతో కోడ్‌ను ఉల్లంఘించకుండా పండుగను జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా సీఐ సురేశ్‌ను ముస్లింలు సన్మానించారు. జామియా మసీదు అధ్యక్షుడు, ముతవల్లి లతీఫ్, మహ్మద్ జావీద్, రఫీక్, షమీవుల్లా, ఆర్టీ ఖాన్, మహ్మద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా వాటర్ బెల్



కొత్తపాళ్యం ప్రాథమిక పాఠశాలలో వాటర్ బెల్ సందర్భంగా నీళ్లు తాగుతున్న విద్యార్థులు

రొళ్ల: వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో వాటర్ బెల్ తప్పని సరిగా అమలు చేయాలని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపాళ్యం ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీధర్ మాట్లాడుతూ వాటర్‌బెల్‌కు అనుగుణంగా విద్యారులు నీళ్లు తాగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకునికి తీవ్ర గాయాలు

హిందూపురం అర్బన్: పట్టణంలోని కొటిపి రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ 11వ వార్డు ఇన్‌చార్జ్ చాంద్‌బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం కొటిపి వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి టూ వీలర్ బోల్తా పడటంతో ఆయన తలకు, కళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హిందూపురం ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

రొద్దం: మండల పరిధిలో రెడ్డిపల్లి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న నలుగురు గ్రామ వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన వలంటీర్లు తమ రాజీనామాలను ఎంపీడీఓ కేశవరెడ్డికి సమర్పించారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడాని తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు.

మడకశిరలో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

మడకశిర: మడకశిరలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని మడకశిర వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన బైక్ ర్యాలీనే నిదర్శనమన్నారు. బైక్ ర్యాలీకి నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేశారని పేర్కొన్నారు. ఐదు మండలాల్లోనూ ఎండలు మండుతున్నా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి బైక్ ర్యాలీలో పాల్గొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మద్దతు పలికారన్నారు. బైక్ ర్యాలీని విజయవంతం చేసిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బైక్ ర్యాలీకి లభించిన ఆదరణ చూసి టీడీపీ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోందనడానికి బైక్ ర్యాలీ విజయవంతమే ఉదాహరణ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈనెల రోజులు కష్టపడి పనిచేయాలని, మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేసి వైఎస్ జగన్‌కు కానుకగా అందిద్దామని సూచించారు.

400 లీటర్ల కల్లు స్వాధీనం



కల్లును స్వాధీనం చేసుకున్న పోలీసులు

పావగడ: తాలూకా పరిధిలోని దొమ్మతమరిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లో అక్రమంగా తరలిస్తున్న 400 లీటర్ల కల్లును క్రైం బ్రాంచ్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. బొలెరో వాహనం (ఏపి02టీఎఫ్1421)లో మూడు డ్రమ్ముల్లో వెంకటమ్మనహళ్లికి చెందిన రామాంజినేయులు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వ్యక్తితో పాటు వాహనం, కల్లును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

అనారోగ్యంతో విలేజ్ సర్వేయర్ మృతి



రాజేశ్వరి (ఫైల్)

పరిగి: మండలంలోని ఎర్రగుంట సచివాలయంలో విజేజ్ సర్వేయర్‌గా పని చేస్తున్న రాజేశ్వరి (27) అనారోగ్యంతో చనిపోయారు. ఆమె స్వగ్రామం పరిగి మండలం బోరెడ్డిపల్లి. ఆమె తండ్రి జయరామప్ప గత నాలుగేళ్ల క్రితమే చనిపోయాడు. తల్లి అలివేలమ్మతో పాటు మరో ఇద్దరు చెల్లెళ్లతో కలిసి రాజేశ్వరి గ్రామంలో నివసిస్తున్నారు. రాజేశ్వరే కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఊపిరితిత్తుల సమస్యతో చికిత్స పొందుతూ సోమవారం చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఆమె మృతి పట్ల రెవెన్యూ ఉద్యోగులతో పాటూ సచివాలయ సిబ్బంది సానుభూతిని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలమత్తూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని భద్రప్పపల్లికి చెందిన శ్రీనివాసులు (35) సోమవారం సాయంత్రం చిలమత్తూరు మండలం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. సోమఘట్ట పంచాయతీ చెరువుకిందపల్లి సమీపంలోకి చేరుకోగానే నియంత్రణ కోల్పోయి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. అదే సమయంలో అటుగా వచ్చిన ఎస్ఐ గంగాధర్ వెంటనే స్పందించి క్షతగాత్రుడిని తన జీపులో బాగేపల్లికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

పరిగి: మండలంలోని చిన్నపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. రొద్దం మండలంలోని కలిపి గ్రామానికి చెందిన షర్ఫుద్దీన్ ద్విచక్ర వాహనంపై గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో చిన్నపల్లి వద్ద మరో ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా రావడంతో పరస్పరం వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో షర్ఫుద్దీన్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి గాండ్ల సోదరులు



గాండ్ల హరికృష్ణ సోదరులకు పార్టీ కండువా వేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

గోరంట్ల: మండలపరిధిలోని వడిగేపల్లికి చెందిన గాండ్ల హరికృష్ణ, ఆయన సోదరుడు చెన్నకేశవ టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం పెనుకొండలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి ఉషశ్రీచరణ్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్శింపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మృతికి సంతాపం



శ్రీరాములు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న శాంతమ్మ, ఇంద్రజ

హిందూపురం: పెనుకొండ మండల జెడ్పీటీసీ గుట్టూరు శ్రీరాములు గుండెపోటుతో మృతి చెందడం తీరనిలోటని వైఎస్సార్‌సీపీ హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని అన్నారు. సోమవారం శ్రీరాములు స్వగృహం వద్ద ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు.

జూదరుల అరెస్టు

రొద్దం: మండల పరిధిలోని రాగిమేకులపల్లిలో జూదం ఆడుతున్న 13 మందిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు. వారి వద్ద నుంచి 13,200 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీవైఈఓ రంగస్వామి

హిందూపురం టౌన్: ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీవైఈఓ రంగస్వామి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ గంగప్ప అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ముందస్తు అడ్మిషన్లు నిర్వహించరాదన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. ఎంఈఓలు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ల బైండోవర్

పెనుకొండ: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీ షీటర్లను, అనుమానితులను సోమవారం సాయంత్రం సీఐ యగంధర్ తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా రౌడీ షీటర్లను సీఐ కార్యాలయానికి పిలిపించిన హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు.



అగళి: షాపులో బట్టలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



హిందూపురం: గాంధీ సర్కిల్‌లో ట్రాఫిక్ జామ్ అయిన దృశ్యం



హిందూపురం: వేపాకు, మామిడి ఆకులు కొనుగోలు చేస్తున్న దృశ్యం



మడకశిర పట్టణంలో పూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు



పావగడ: ఎర్రదారాలు విక్రయిస్తున్న మహిళ

ఉగాది సందడి

సాక్షిబృందం: తొలి తెలుగు పండుగ ఉగాదికి పచ్చతోరణాలతో సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో మార్కెట్లు, ప్రధాన వీధులు సోమవారం కిటకిటలాడాయి. వేపా, మామిడి ఆకులు, బిళపత్రి, నిత్యావసరాల కొనుగోలు దారులతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.